

"ఆ రోజు పార్టిలో ఒక విశేషం జరిగింది–అందరూ బ్రాందీ తాగుతున్నారు. 'కర్టసీ కోసమైనా మీరూ తాగాలి, సార్' అని బలవంతం చేశారు. సరే నన్నాడు. గ్లాను పెదవుల దాకా వచ్చింది. తాగబోయి గ్లాసులోకి చూశాడు. అందులో రెండు అందమైన కళ్ళు మెరిశాయి. గ్లాను కింద పెట్టేశాడు."

ఇంతకీ భోజనానికి వస్తారా, రారా?"

"ముందీ సంగతి తేలాలి."

"సరే, ఎంతసేపు కూర్చుంటారో కూర్చోండి."

"'మల్లెమొక్క వేస్తాను' — అనే వరకూ ఇలాగే కూర్చుంటాను."

"ఆరు మార్లైనా మల్లె మొక్క వెయ్యమంటే వెయ్యను" అని

# ధ్రువాలు

రత్న [illegible]

సోఫాలో కూర్చుంది సులోచన. రామం సోఫా చివరికి జరిగి, మరో వైపుకు తిరిగి కూర్చున్నాడు.

వారపత్రిక తీసి పేజీలు తిరగేస్తూంది సులోచన.

"అది వాది" అన్నాడు రామం, 'ఎందుకు తీశావ్?' అన్న అర్థంతో.

"ముష్టి వీక్లీ" అని విసిరికొట్టి, లేచి విసవిసా తన గదిలోకి వెళ్ళి, మరొక వారపత్రిక తెచ్చుకు కూర్చుంది సులోచన.

కొన్ని క్షణాలు గడిచాక రామం, "అబ్బా! అదంతా చదువే కాబోలు?" అన్నాడు.

"నా ఇష్టం! చదువుకోకపోతే బొమ్మలు చూసుకుంటాను."

"ఆ తరవాత ఆల్బంలో అంటించుకో!"

"ఆల్బంలో కాకపోతే ఆల్మైరాలో అంటించుకుంటాను."

మరికొన్ని క్షణాలు నిశ్శబ్దం.

రామం లేచి భార్య చేతిలోని పత్రిక హఠాత్తుగా లాక్కుని నేలకేసి కొట్టి, తన స్థానంలో కూర్చున్నాడు.

సులోచన, "ఏమిటి మీ ఉద్దేశ్యం?" అంది.

"ఏం, ఇందాక నా వీక్లీని నేలకేసి కొట్టలా?"

"ఐతే, నే నేం చేస్తే, అది చేస్తారన్న మాట."

"అందుకు సందేహమా?" అని కథలో చిలకలా పలికాడు రామం.

"నేను చీర కట్టుకున్నాను. మీరూ కట్టుకుంటారా?"

"ఓ. నీ తెల్లచీర ఇవ్వు, లుంగీగా కట్టుకోకపోతే అప్పు డడుగు?"

"సిగ్గంటేగా?"

"రాముడి తమ్ముడు శత్రుఘ్నుడంతటివాడు పెళ్ళాం చీర కట్టుకు చక్కావచ్చాడుట! నా కెందుకు సిగ్గు?"

"ఇంతకీ భోజనానికి లేస్తారా, లేవరా?"

"మ ల్లె మొ క్క వే స్తా వా, వెయ్యవా?"

"అసలు మీతో వాదించటం నా బుద్ధి తక్కువ" అని పెడముఖం పెట్టి కూర్చుంది సులోచన.

ఇంతలో రానే వచ్చారు సుబ్బారావు, ఇందిరలు.

"అదేమిట్రా, అలా — అమెరికా, రష్యా ప్రతినిధుల్లా కూర్చున్నారు?" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

సులోచన నవ్వుతూ లేచి, "కూర్చోండన్నయ్యా! ఆయనగారు సత్యాగ్రహం చేస్తున్నారు" అంది.

"అలాగా! ఒరే, రామం, నువ్వు వచ్చేవరకూ నేను 'రిలే' సత్యాగ్రహం చేస్తూంటానుగానీ, త్వరగా అన్నం తిని రా" అన్నాడు సుబ్బారావు కూర్చుంటూ.

"చాల్లేవోయ్ ఎగతాళీ! నీ గీటు దాటనిది గనక మా చెల్లాయి, నీకేం తెలియటం లేదు" అన్నాడు రామం.

ఆ మాటకు సుబ్బారావు పొంగిపోయి, ఇందిర వైపు చూస్తూ—

"ఆ మాట నిజమే ననుకో?" అని, రామం వైపు తిరిగి, "అంతెందుకు? ఇందిర చీరలు కూడా నా సెలక్షనే!" అన్నాడు.

ఇందిర చిరునవ్వుతో సులోచన వంక చూచింది. ఆ చూపులో అతిశయమే ఉంది.

ఇంతలో సుబ్బారావే అందుకున్నాడు: "అయినా, మా చెల్లాయి మాత్రం నీ మాట ఏం వినలేదోయ్?"

"రాత్రి నిమ్మకాయ చారు కాయమంటే, మిరియాల చారు పెట్టింది" అని ఫిర్యాదు చేశాడు రామం.

"మీకు జలుబుగా ఉందని పెట్టాను, తప్పేముంది?" అని సంజాయిషీ ఇచ్చింది సులోచన.

"అదేమంటే, ఆరోగ్య మాత్రాలు — డాక్టరైనట్టు." రామం చెప్పాడు.

"ఈ మాత్రానికి డాక్టరే కానక్కర్లేదు" అని సులోచన సమాధానం.

సుబ్బారావు కల్పించుకుని, "వంట విషయంలో మట్టుకు నా ఇన్‌స్ట్రక్షన్సే ఫాలో అవుతుంది మీ చెల్లెలు. నిన్న కాకరకాయలు తెచ్చి, పచ్చడి చెయ్యమంటే — మారు మాటాడకుండా చేసేసింది. తీయగా, పుల్లగా, చేదుగా, బ్రహ్మాండంగా ఉం…" అని ఇంకా చెప్పబోతూంటే, ఇందిర అందుకుని, "అబ్బబ్బ, మీరు మరీను — వంటింటి విషయాలు కూడా చెప్పాలా ఏమిటీ?" అని మందలించింది. ఆ మందలింపులో 'ఇంకా చెప్పండి' అన్న ధ్వని ఉంది.

"తప్పేముందోయ్? వీళ్ళేమన్నా పరాయివాళ్ళా?" అని సమర్థించుకున్నాడు సుబ్బారావు. ఒక క్షణం ఆగి, "ఆఁ, ఇంతకీ వప్పుచారు విషయంలో నీ మాట వినలేదు మా చెల్లాయి. అంతేగా? !" అన్నాడు.

"ఎందుకులే? చెప్పాలంటే … చాలా ఉన్నాయి" అన్నాడు నిస్పృహతో రామం.

సులోచన గిరుక్కున రామం వైపు తిరిగి, "చాలా ఉన్నాయా! ఒక్కటి చెప్పండి, చూద్దాం?" అంది తీవ్రంగా.



"మొన్న జ్వరం వచ్చినప్పుడు — వెధవ చేదు విషం లాంటి కషాయం నా నోట్లో పోసి, తనేమో హాయిగా 'విదరో'యింది" అన్నాడు రామం, తనకు తానే చెప్పుకుం టున్నట్లు.

"అబద్ధాలాడకండి. 'రాజాజీ భారతం' చదివి వినిపించలేదూ?" అంది సులోచన.

రామం గొణిగాడు— "ఎంతసే పేమిటి ... 'రహస్యం' సెకండ్ షో వదిలేంత వరకేగా?" అని.

సుబ్బారావు అందుకున్నాడు: "నా కేమాత్రం సుస్తీ చేసినా, మా చెల్లాయికి కంటిమీద కునుకుండ దనుకోరా, రామం! అంతెందుకు? రాత్రి కాస్త తలనొప్పిగా ఉందన్నాను. అంతే! అనాసిన్, అవేదన్, ఆస్ప్రో, సారిడన్ — టాబ్లెట్సు నాలుగూ మేసుకునేదాకా ఊరుకోలేదనుకో. అంతటితో ఆగిందా? కాసేపు తల, కాసేపు కాళ్లు — తెల్లవార్లూ ..." అంటూ చెప్పుకు పోతున్న భర్త నుద్దేశించి —

"ఇలా అయితే, నేను వెళ్లిపోతాను, బాబూ!" — అంటూ లేచి, చిరు కోపం ప్రదర్శించింది ఇందిర. అందులో 'ఇంకా పొగడండి' అన్న అర్థం ఉంది.

"పరవాలేదులే, వదినా! మా అన్న లాగ మా అన్న భార్యను విమర్శించటం లేదుగా?" అని ఇందిరను కూర్చో బెట్టింది సులోచన.

"ఉన్న సంగతి చెప్పటం విమ ర్శించటమా?" అన్నాడు రామం.

సర్దుబాటు చేసే స్వరంతో, సుబ్బారావు, "ఆఁ, సంగతి లేదు, విమర్శా లేదుగానీ — ఇందులో ఏముందిరా, రామం? భార్యా భర్త లన్నాక ఒకరి మా టొకరు వినాలి. రెండో రాళ్ల నెక్లెస్ కొనాలంది మా చెల్లెలు; కొనేశాను. అలాగే సర్దుకుపోవాలిగానీ మరీ ..."అన్నాడు.

రామం అందుకుని, "సర్దుకు పోవటం లేదేమిటి?" అన్నాడు.

"సర్దుకుపోతే ఈ సత్యాగ్రహం ఎందు కేమిటీ?"అని అంది సులోచన వెక్కిరింపుగా.

సుబ్బారావు నవ్వి, "అసలు సంగతి మరిచేపోయాను. ఈ సత్యాగ్రహం దేనికిరా?" అని అడిగాడు.

"ఇంటి ముందు మల్లె మొక్కలు వెయ్యా లన్నాను. కాదు, గులాబీ మొక్కలు వెయ్యా లంటుంది." ఫిర్యాదు చేశాడు రామం.

"అవును. నాకు గులాబు లంటే ఇష్టం. ఏం, ఇంటి వెనక స్థలంలో కొబ్బరి మొక్కలూ, నిమ్మ మొక్కా వేశారు గానీ ... ఒక్క మామిడి అంటు వెయ్యమంటే వేశారా?" అంది సులోచన.

"నిమ్మ, కొబ్బరి సంవత్సరం అంతా కాస్తాయి. మామిడి ఒక్క వేసవిలోనేగా కాసేది?" వివరించాడు రామం.

"గులాబీ సంవత్సరం అంతా పూస్తుంది. మీ మల్లె ఒక్క వేసవి లోనేగా పూసేదీ?" వాదించింది సులోచన.

తాకనక్కరలేదు" అని రెట్టించింది సులోచన.

"తాకటమేగాదు, అసలు చూడనే చూడను" అని లేచాడు రామం.

"మరీ మంచిది" అని సులోచన కూడా లేచి, సుబ్బారావుతో, "ఉండం డన్నయ్యా, కాఫీ పట్టుకొస్తాను" అని వంటింట్లోకి వెళ్లింది. సుబ్బారావు సంజ్ఞ ననుసరించి ఇందిర కూడా సులోచన వెనకే వెళ్లింది.

సులోచన స్టౌ వెలిగించి, నీళ్ళు పెట్టింది గిన్నెలో. ఇందిరను చూచి, "రా, వదినా!" అని ఆహ్వానించింది.

ఇందిర మెల్లిగా సమీపించి "మా క్లబ్ వార్షికోత్సవానికి నువ్వు రాలేదు

## స్వాగతం! ఉగాది!

**'అవ్వారి'**

నవతా సమాజ మానవతాభ్యుదయ కాంతిఁ
బ్రసరించి భానుండు పరిఢవింప,
జనతా హృదయరాగ జనితామలాదర్శ
పద్మమ్ముగా కాంతి పరిమళింప,
మహితామరత్యాగ సహితాతి పావిత్ర్య
మయమానస మధుప మాలపింప,
సమతాలతానుమ మమతా సుగంధమ్ముఁ
భువనమ్ము దిశదిశఁ బ్రస్తరింప;
రక్తిఁగవి పిక జయగీతి లయపథాన
నీతి రీతుల శింజనుల్ నిక్వణింప;
దివ్య చరణ! శుభకరణ! భవ్య రమ్య!
స్వాగతమ్ము! ఉగాది! సుస్వాగతమ్ము!! ●

"గులాబీ నిండా ముళ్ళే. ముళ్ల మొక్క ఇంటి ముందు ఉండ కూడదు" అన్నాడు రామం.

"మా నిమ్మకు లేవా ముళ్ళు? ఇంటి వెనక ఉండవచ్చుగానీ, ముళ్ల మొక్క ఇంటి ముందు ఎందుకు ఉండకూడదు?" నిలదీసింది సులోచన.

"నాకు మల్లెపూలంటే ఇష్టం" అని రామం అంటే, "పెట్టుకునే దాన్ని నేను—నాకు గులాబీ అంటేనే ఎక్కువిష్టం" అంది సులోచన.

"గులాబీలకైతే నేను నీళ్ళు తోడను, ముందే చెబుతున్నా" అని రామం బెదిరిస్తే, "మరేం ఫరవాలేదు. నా గులాబుల్ని మీ రసలు తాకనుగూడా

గానీ, సులోచనా, చాలా బాగా జరిగింది ఫంక్షన్" అంది.

"అలాగా! విశేషా లేమిటో చెప్పు, వినైనా తృప్తిపడతాను."

"స్పోర్ట్సు, గేమ్సు, ఎంబ్రాయిడరీ పోటీలు, పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు — చాలా బాగా జరిగాయిలే!"

"ఇంతకీ, నీ కేమైనా ప్రైజు వచ్చిందా, లేదా, ముందా సంగతి చెప్పు?"

ఇందిర తృప్తిగా గాలి పీల్చి, "ఏదో వచ్చిందిలే — వ్యాసరచనలో ఫస్టు ప్రైజు" అంది.

"అమ్మ దొంగా! చెప్పలేదేం మరి? కంగ్రాచులేషన్స్. అయితే, నీకు స్పెషల్ కాఫీ ఇవ్వాలిసిందే."

"ఆవాళ నువ్వు రాలేదని ఎంతో ఫీలయ్యాను. ఈసారైనా నువ్వు తప్పకుండా మెంబరువు కావాలి."

"అలాగే ... వ్యాసరచనకు సబ్జక్టు ఏమిటి?"

"త్యాగమే స్త్రీకి కొంతబద్ద"

ఇద్దరూ హాల్లోకి వచ్చారు. "అన్న గారూ! మా వదినకు వ్యాసరచన పోటీలో ఫస్టు ప్రైజు వచ్చిందట! మీరు చెప్పనేలే దింతవరకూ?" అంది సులోచన.

"ఆఁ, అదేమంత పెద్ద విషయం గనక? అసలు ఎంబ్రాయిడరీలో కూడా ప్రైజు రావలసిందేగానీ, ఒక జడ్జి పక్షపాతం చూపించిందిట. ప్చ్, వస్తే వచ్చింది, పోతే పోయింది గాని వెధవప్రైజు — ఆ వ్యాసం చదివి తీరాలిరా, రామం! ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క మణిపూ సంటే నమ్మే!

ముఖ్యంగా ఆ ముగింపు వాక్యాలు ఎంత బాగున్నాయంటే — నేను కంఠతా పట్టేశాను. ఆఖరి వాక్యం చెబుతాను విను : 'భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు స్త్రీ పెట్టనికోట! ఆ కోటకు పునాది త్యాగము.' ఎలా ఉందిరా?"

"చాలా బాగుంది. మా చెల్లాయి రచయిత్రి కూడా నన్న మాట!" మెచ్చుకున్నాడు రామం.

సులోచన వంటింట్లోకి వెళ్లి, రెండు కప్పుల కాఫీ తెచ్చి సుబ్బారావుకు, ఇందిరకు ఇచ్చింది.

"మరి నాకో?" అన్నాడు రామం ఉడుకుబోతుతనంతో.

"సత్యాగ్రహులు కాఫీ తాగరు." వచ్చే నవ్వు ఆపుకుంటూ వంటిం ట్లోకి వెళ్లిపోయింది సులోచన.

"ఒరేయ్! సత్యాగ్రహాల నిలవ గాంధీ, పొట్టి శ్రీరాములు — వాళ్ళే తోటే పోయిందిరా! ఎందుకుగాని పేచీ, అన్నం తినేసి రా! ఆదివారం పూట ఆట లేకుండా ఎందుకు వేస్టు చేస్తావు?" అని బ్రతిమాలాడు సుబ్బారావు.

వంటింటి నుండి గిన్నెల చప్పుడు వినిపించింది. ఆ తరవాత "నేను భోజనం చేస్తున్నాను" అన్న సులోచన గొంతు వినిపించింది. రామం లేచి వంటింటి గుమ్మంలోకి వెళ్లి చూచే సరికి, సులోచన పళ్లెంలో అన్నం కలుపుకుంటూంది. "పడింది పళ్లెం

మీూం, తిండిపోతు" అని గబగబా వెళ్లి పళ్లెం లాక్కున్నాడు.

"ఇలా సత్రంలో రాళ్లు కొట్టక పోతే, పెట్టమంటే పెట్టనూ?" మరొక పళ్లెంలో వడ్డించింది, సులోచన నవ్వుకుంటూ.

ఇక్కడ హాల్లో—ఇందిర భర్తతో మెల్లగా, "ఇదే కాబోలు ప్రేమ వివాహం? ప్రతి చిన్న విషయానికీ పంతాలూ, వాదాలూ అయితే — వీళ్లిక సుఖపడే దెప్పుడండీ? పుణ్యకాలం కాస్తా పోట్లాటలతోటే సరిపోయె!" అంది.

"పాపం, రామాన్ని చూస్తే జాలి వేస్తుంది. అంత మంచివాడికి ఆ మంకుపెళ్లాం దొరికింది!" జాలి పడ్డాడు సుబ్బారావు.

"కట్టుకున్నవాడంటే ఆమాత్రం ఖాతరు లేకపోతే ఎలా?" ఇందిర ప్రశ్న.

"పోనీ, నువ్వొకసారి చెప్పిచూడు—ఏమన్నా దారికి వస్తుందేమో? కనీసం నిన్ను చూసైనా నేర్చుకోదేం?"

"జన్మతః రావాలిగానీ, నేర్చుకొంటే రావండీ. 'భర్తకోసం భార్య ఏత్యాగమైనా చెయ్యాలి, సులోచనా!' అంటే, 'భార్యకోసం భర్త త్యాగం చెయ్యనక్కరలేదా?' అని ఎదురుప్రశ్న వేసింది. అటువంటిదానికి చెప్పి ఏం ప్రయోజనం? దానికితోడు అందగత్తె నని అతిశయం."

"అందం విషయంలో సులోచనకు మంచి మార్కులే వస్తాయి. ఏమంటావు?" అని సుబ్బారావు మెచ్చుకుంటే, "ఆఁ, ఏం అందం లెస్తురూ, ఆ కళ్లు రెండూ మినహాయిస్తే — ఆవిడా అందరిలాంటిదే." అసూయ దాచుకోలేక అనేసింది ఇందిర.

ఇంతలో వంటింటి నుండి గిన్నెల చప్పుడు వినిపించింది.

"ఏమ్రా! త్వరగా రండి, క్లైవ్ పోతూంది" అని హెచ్చరించాడు సుబ్బారావు. కొన్ని క్షణాలకు రామం వచ్చాడు. కారమ్ బోర్డు తెచ్చి, కాయిన్సు సర్దుతూండగా సులోచన వచ్చింది. సాయంకాలం నాలుగింటి వరకూ ఆట సాగింది మధ్యలో టిఫినూ, కాఫీలతో. మూడవ సారి కాఫీ సేవించి, నిష్క్రమించారు సుబ్బారావు దంపతులు.

ఆకాశం ముత్యాల పందిరిగా మారి, లోకం ముచ్చటలాడుకునే వేళ "రేపేగా మీరు నర్సరీస్‌కు వెళ్లేది?" అని అడిగింది సులోచన.

"ఊఁ, గులాబీ అంట్లే తెస్తాను, రాజీ."

"ఎందుకూ? మల్లెమొక్కలే తెండి — అవైనా నా కిష్టమే" అంది సులోచన.

"....."

"ఏమిటి, ఆలోచిస్తున్నారు?"

హఠాత్తుగా రామం ఉద్విగ్నుడై, "రాజీ!" అంటూ సులోచనను హృదయానికి హత్తుకుని ఊపిరి సలపనివ్వలేదు.

ఆ వరదనుండి తెప్పరిల్లిన పిదప— "రాజీ! నేను పిచ్చివాణ్ణి కదూ?" అన్నాడు.

సులోచన చిరునవ్వే సమాధానం.

"రాజీ! ఎంత తపస్సు చేసి, ఇంత అందమైన కనులు పొందావో!"

"మీ కీర్తి తీసుకోండి."

"మొన్న నాలుగు రోజులక్రితం మా స్టాఫ్ ఇచ్చిన పార్టీలో ఒక విశేషం జరిగింది, రాజీ! అంతా బ్రాందీ తాగుతున్నారు. 'కర్టెసీ కోసమైనా మీరూ తాగాలి, సార్!' అని బలవంతం చేశారు. సరే నన్నాను. గ్లాసు పెదవుల దాకా వచ్చింది. తొంగిచూసాను గ్లాసులోకి చూశాను. అందులో రెండు అందమైన కళ్లు మెరిశాయి. గ్లాసు కింద పెట్టేశాను. ఆ కళ్లెవరివో చెప్పుకో?"

"ఎవరో ఒక అమ్మాయివి!"

"నా ఒడిలో ఉన్న అమ్మాయివి" అని రామం తాను మునుగుతూ ఆమెను ముంచేశాడు పారవశ్యంలో.

* * *

కాలగమనంలో అయిదేళ్లు గడిచాయి.

"సుబ్బారావు నీకోసం కలవరిస్తున్నాడమ్మా. ఒక్కసారి వాడికి కనిపిస్తే చాలంటున్నాడు, చెల్లాయీ!" బ్రతిమాలాడు రామం.

"చెప్పటానికి నోరు లేదు. చేసుకోటానికి చెయ్యి లేదు. నర్సు దయాధర్మం మీద బ్రతుకుతున్నాడు. తెలిసినవాళ్లెవరు కనిపించినా కన్నీరు కారుస్తున్నాడు. చూస్తే హృదయం ద్రవించిపోతుంది, వదినా! నిన్నెలాగైనా తీసుకొస్తామని కొండంత ఆశతో ఎదురుచూస్తుంటాడు, పాపం!" వివరించింది సులోచన.

"క్షమించండి. నేను రాలేను. నా దసలే జాలి గుండె" అంది ఇందిర.

"జాలి గుండె లక్షణం ఇది కాదమ్మా!" కష్టంగా మాట్లాడాడు రామం.

"నువ్వింత మనసు లేని దాని వనుకోలేదు, వదినా? లోకమంతా అయ్యో, పాపం అంటూండిగానీ, నీవు అనలేకపోయావే! అవిటివాణ్ణిలా వదిలి, పుట్టింటికి నువ్వు గనక రాగలిగావు." కర్కశంగా అంది సులోచన.

"నువ్వైతే ఏంచేసేదానివేం?" సవాలు చేసింది ఇందిర.

"దురదృష్టవశాత్తు నా భర్తకే ఇలాంటి జబ్బు ప్రాప్తిస్తే, నా అవయవాలే అతికి బాగు చేయించుకుంటాను." ఆవేశంలో అనేసింది సులోచన.

"మాటలకేం? ఎన్నైనా చెప్పొచ్చు. చేతల దగ్గిరే మనుషుల బడాయి బైట పడేది" అంది ఇందిర.

"ఛీ...ఛీ.. నీలాంటి పాషాణంతో మాట్లాడటం నాదే పొరపాటు" అని లేచి పక్క గదిలోకి వెళ్లిపోయింది సులోచన.

రామం మెల్లగా ఇలా అన్నాడు: "సులోచనను సరిగా అర్థం చేసుకోలేదు, చెల్లాయీ, నువ్వు.

ఒక విషయం చెబితే కొంతవరకూ అర్థమౌతుంది. ఆనాడు ఫైర్ ఆక్సిడెంటులో పోయిన రెండు కళ్లకు బదులు ఇప్పుడు నాకు చూపునిస్తున్న కన్ను ఎవరిదో తెలుసా? సులోచనది" అని తన కళ్లజోడు తీసి చూపించాడు.

ఇందిర నోట కాస్సేపటి వరకు మాట రాలేదు. చివరికి తేరుకుని, "అయితే, సులోచనకి ఒక కన్ను...?"

"నాలాగే ఒక కన్ను గాజు కన్ను" అని పూర్తి చేశాడు రామం, కళ్లజోడు తగిలించుకుంటూ.

ఇందిర సులోచన ఉన్న గదిలోకి వెళ్లింది. అడుగుల చప్పుడు విని వెనుదిరిగింది సులోచన. ఇందిర సమీపించి, సులోచన పెట్టుకున్న కళ్లజోడు తీసింది. ఒక కన్ను నీటితో నిండి ఉంది. ఆ కన్ను తుడుచుకుంటూ నవ్వటానికి ప్రయత్నించింది సులోచన.

"నీ బంగారు కన్ను బలి చేశావా, సులోచనా?" అంది గద్గద కంఠంతో ఇందిర.

"బలి కాదది, నా బహుమానం!" అని నవ్వింది సులోచన.

ఇందిర దుఃఖం ఆపుకోలేక సులోచన హృదయంపై వాలింది. ★



భిక్షు ఫోటో—ఆర్. ఉదయభాస్కరరావు (తిరుచ్చి)